

## రేపు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై సమావేశం

- హాజరుకానున్న జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లా అధికారులు

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

05



సంపుటి :03 | సంచిక :28 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

గురువారం 05, మార్చి 2026



## సాగులో డ్రోన్లను వినియోగించుకోవాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ఐనవోలు మండల కేంద్రంలో డ్రోన్ల పంపిణీ

04



### క్షేత్రస్థాయిలో పర్యటించాలి

కలెక్టర్లు కేవలం ఏసీ గదులకే పరిమితం కాకూడదు. ఫైళ్లను క్లియర్ చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను స్వయంగా చూడాలి. నెలకు కనీసం 10 రోజుల పాటు జిల్లాల్లో పర్యటించాలి. గ్రామాలు, పాఠశాలలు, ఆసుపత్రులను తనిఖీ చేసి వ్యవస్థలో లోపాలను సరిదిద్దాలి. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలగాలంటే మీరు వారి మధ్య ఉండాలి. ఇసుక, సహజ వనుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి రాజీ వద్దు. ప్రభుత్వం మీతోడుగా ఉంటుంది. - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# కలెక్టర్.. ఆన్ ది స్పాట్!

- సీఎం రేవంత్ ఆదేశాలతో కొత్త బూస్టింగ్
- ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పిటల్స్, విద్యాలయాల సందర్శన
- అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం
- అండగా మేమున్నామంటూ భరోసా

03

జనం మధ్యకు జిల్లా పాలనాధికారులు | ఆరు జిల్లాల్లో కలెక్టర్ల విస్తృత పర్యటనలు







ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పాలనను పరుగులెత్తించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరుగురు కలెక్టర్లు ముమ్మరంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. కలెక్టర్లు ఏసీ గదులకే పరిమితం కాకుండా నెలకు కనీసం పది రోజులైనా ఫీల్డ్ విజిట్ చేసి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో ఆరు జిల్లాల కలెక్టర్లు కదిలారు. దీనిలో భాగంగానే గురువారం భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుతూ ప్రజలకు భరోసా కల్పించారు.

– అక్షరదర్బార్, వరంగల్

02









## రాజ్యసభ బరిలో వేం... సింఘ్వీ

- అసెంబ్లీలో నామినేషన్లు దాఖలు
- ఎమ్మెల్యేలు, ఎంపీల సమక్షంలో అందజేత
- వేం నరేందర్‌రెడ్డికి అవకాశం..
- ఉమ్మడి జిల్లాకు దక్కిన గౌరవం
- వైఎస్సార్, కేవీపీ స్నేహం తరహాలో రేవంత్, వేం స్నేహం
- సోషల్ మీడియాలో వారి ఫ్రెండ్‌షిప్‌పై చర్చ

05

## ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఎగ్జామినర్



రూ.35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి

02



# కలెక్టర్.. ఆన్ ది స్పాట్ !

- జనం మధ్యకు జిల్లా పాలనాధికారులు
- ఆరు జిల్లాల్లో కలెక్టర్ల విస్తృత పర్యటనలు
- సీఎం రేవంత్ ఆదేశాలతో కొత్త బూస్టింగ్
- ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పిటల్స్, విద్యాలయాల సందర్శన
- అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం
- అండగా మేమున్నామటూ భరోసా

అక్షరదర్బార్, వరంగల్ :
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పాలనను పరుగులెత్తించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరుగురు కలెక్టర్లు ముమ్మరంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. కలెక్టర్లు ఏసీ గదులకే పరిమితం కాకుండా నెలకు కనీసం పది రోజులైనా ఫీల్డ్ విజిట్ చేసి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో ఆరు జిల్లాల కలెక్టర్లు కదిలారు. దీనిలో భాగంగానే గురువారం భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దుతూ ప్రజలకు భరోసా కల్పించారు.

### - విద్యార్థుల్లో భరోసా నింపిన కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జంగేడులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు కేవలం 9 రోజులే సమయం ఉన్నందున, విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపారు. ప్రతి విద్యార్థి టాపరేనని, ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలోని వసతులు, భోజనశాల, నిత్యావసరాల నిల్వలను పరిశీలించడంతో పాటు, ప్రహరీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

### - వైద్య సేవలపై కలెక్టర్ దివాకర టీఎస్ ఆరా

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని స్పష్టం చేస్తూ, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డు, ల్యాబొరేటరీ, వృద్ధాప్య వార్డులను స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతిరోజూ వచ్చే ఇన్ పేషెంట్ల వివరాలు, డాక్టర్ల హాజరును పర్యవేక్షిస్తూ వైద్య వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### - రెవెన్యూ సేవలపై కలెక్టర్ బాజ్ పాయ్ తనిఖీ

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఐనవోలు మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దరఖాస్తులను, ముఖ్యంగా భూ భారతి మరియు సాదా బైనామా కేసులను ఏమాత్రం జాప్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రికార్డు రూములను పరిశీలించి, ప్రభుత్వ సేవల్లో పారదర్శకత ఉండాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష చేస్తూ, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు మెరుగుపడాలని సూచించారు.

### - పరిశుభ్రతపై కలెక్టర్ సత్యశారద ఆగ్రహం


వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఖిలా వరంగల్ మండలంలోని కమర్పల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను రుచి చూసి పరిశీలించడంతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పోషకాహార నిల్వలను, వాటి గడువు తేదీలను తనిఖీ చేసి చిన్నారుల ఆరోగ్యం విషయంలో రాజీ పడకూడదని ఆదేశించారు.

### - ప్రాథమిక వైద్యంపై కలెక్టర్ సందీప్ సూచనలు

జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లింగాల ఘనపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. నిరుపేదలకు అందుతున్న వైద్య సేవలపై ఓపి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ముఖ్యంగా గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని, వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని మెడికల్ అధికారులకు ఆదేశాలిచ్చారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

### - విద్యార్థుల భవిష్యత్తుపై కలెక్టర్ స్నేహ శ్రద్ధ

మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్ బయ్యారం మండలంలోని ఇస్లాపురం గిరిజన ఆశ్రమ పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలోని 19 ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా డిజిటల్ తరగతులు, ప్రాక్టికల్స్ ద్వారా బోధన అందించాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి వంద శాతం ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు.



ఐనవోలు తహసిల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్




కుమారపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో తనిఖీలు చేస్తున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



జంగేడు కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ఇస్లాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేస్తున్న మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్




లింగాలగణపురం పీహెచ్ సీలో ఆకస్మిక తనిఖీలు జరుపుతున్న జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

# కడియం అనర్హత పిటిషన్ పై ముగిసిన విచారణ

- తీర్పును రిజర్వ్ చేసిన సభాపతి
- స్పీకర్ తీర్పుపై ఉత్కంఠ



అక్షరదర్బార్, హైదరాబాద్ :
స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై ఉత్కంఠ నెలకొంది. గురువారం మధ్యాహ్నం శాసనసభలోని సభాపతి గదిలో ఈ పార్టీ ఫిరాయింపు కేసుపై సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తుది విచారణ నిర్వహించారు. ఉభయ పక్షాల న్యాయవాదులు తమ వాదనలను వినిపించిన అనంతరం, సభాపతి తన నిర్ణయాన్ని అట్టిపెట్టుకుంటున్నట్లు (రిజర్వ్) ప్రకటించారు. కడియం గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరడంపై అందిన ఆధారాలను సభాపతి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇదే తరహా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్ కేసు విచారణ కూడా ప్రారంభమైంది. ఇప్పటికే ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న ఎనిమిది మంది శాసనసభ్యులకు సభాపతి విముక్తి కల్పించిన నేపథ్యంలో, మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు కడియం, దానం కేసుల్లో ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనేది రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. వీరిద్దరి విషయంలో పార్టీ మారినట్లు పక్కా ఆధారాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుండటంతో, సభాపతి ఇచ్చే తీర్పుపై సర్వత్రా ఆందోళన నెలకొంది. త్వరలోనే ఈ కేసులపై సభాపతి కార్యాలయం అధికారిక ప్రకటన వెలువరించే అవకాశం ఉంది.

# ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఎగ్జామినర్

### - రూ.35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి



అక్షరదర్బార్, హైదరాబాద్: జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో అకౌంట్ సెక్షన్ విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సూర్య వంశీ సంతోష్ లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ (విశ్రాంత ప్రయోజనాలు) కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతులను ఉన్నతాధికారులకు పంపేందుకు సంతోష్ రూ. 40 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ. 35 వేలకు ఒప్పందం కుదుర్చుకోగా, బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి నుంచి నగదు తీసుకుంటుండగా సిటీ రేంజ్ 2 ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి సంతోష్‌ను పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.

# హెచ్‌పీవీ టీకా – ఆడబిడ్డలకు రక్షణ కవచం

- గర్భాశయ క్యాన్సర్ నివారణకు స్వర్ణావకాశం
- హెచ్.పి.వి టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: హెచ్.పి.వి (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా ఆడబిడ్డల భవిష్యత్తుకు రక్షణ కవచమని, గర్భాశయ క్యాన్సర్ నివారణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వం చేపడుతున్న హెచ్.పి.వి టీకా కార్యక్రమాన్ని అర్హులైన బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఏరియా హాస్పిటల్ ఏటూరునాగారం సూపరింటెంట్ డాక్టర్ సురేష్ కుమార్ తదితరులతో గర్భాశయ క్యాన్సర్ నివారణకు హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గర్భాశయ క్యాన్సర్‌ను ముందస్తుగా నివారించేందుకు "హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్" ఒక మంచి అవకాశం అని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ నుండి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ములుగులో హెచ్.పి.వి టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. అర్హులైన బాలికలు తప్పనిసరిగా ఈ టీకాను వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ, 01-02-2011 నుండి 28-02-2012 మధ్య జన్మించిన 14 సంవత్సరాల బాలికలు ఈ టీకాకు అర్హులని తెలిపారు. ములుగు జిల్లాలో మొత్తం 3,127 మంది బాలికలు అర్హులుగా గుర్తించామని చెప్పారు. ఇది సింగిల్ డోస్ టీకా అని వివరించారు. ఈ సమావేశంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ వి. చంద్రశేఖర్, ఏరియా హాస్పిటల్ ఏటూరునాగారం సూపరింటెంట్ డాక్టర్ సురేష్ కుమార్, ఎం & హెచ్ ఎన్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్, రాయినిగూడెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగ అనేష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనే ధ్యేయంగా 'ప్రజా పాలన' – 99 రోజుల ప్రణాళిక

**మండల ప్రత్యేక అధికారి బాపు రావు**

అక్షర దర్బార్, మల్హర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి బాపు రావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్ణీత 99 రోజుల్లో నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేస్తే ప్రణాళిక విజయవంతమవుతుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ కె. క్రాంతి కుమార్, తహసీల్దార్ రవి కుమార్, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## రేపు మున్సిపల్ చైర్మన్ గా సునీల్ బాధ్యతల స్వీకరణ




అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి మున్సిపల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పావుశెట్టి సునీల్ కుమార్ శుక్రవారం అధికారికంగా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. పరకాల పట్టణంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ సౌందర్యం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. పరకాలను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## ఆరె కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

అక్షర దర్బార్, దుగ్గొండి : నూతనంగా ఎన్నికైన ఆరె కుల సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఒలిగే నరసింగరావును నర్సంపేట ఫిట్నెస్ గ్రూప్ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. మండలంలోని రేకంపల్లి గ్రామంలో నిర్వహించిన సన్మాన సభలో ఆయనకు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫిట్నెస్ గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ, నరసింగరావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. సంఘం అభివృద్ధికి ఆయన నాయకత్వం దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నర్సంపేట పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.ఎం. జేయుడు, డాక్టర్ పి. గోపాల్, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, డాక్టర్ ఏ. రవికృష్ణ, డాక్టర్ రాజేష్, నర్సంపేట మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్, బాలాజీ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మోర్తాల రామరాజు, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ రెడ్డి, కాకతీయ గ్రాడ్యుయేట్ జూనియర్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కూతురు వీరారెడ్డి, అక్షర దర్బార్ దినపత్రిక నర్సంపేట డివిజన్ ఇంచార్జ్ వంగాల ప్రేమ్ సాగర్ రెడ్డి, మమత ఐరన్ షాప్ యజమాని శ్రీనివాసరావు, శ్రీనివాస మెడికల్ షాప్ యజమాని శ్రీకాంత్, వైన్ షాప్ యజమాని బొబ్బల కరుణాకర్ రెడ్డి, బద్రి డైరీ ఫామ్ యజమాని వంకాయలపాటి వీరభద్రరావు, సాఫ్ట్వేర్ మూడ్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.





## నూతన వధూవరులకు అవనీ స్కీమ్ కింద రూ.10,116 అందజేత

అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన కత్తుల రాజమ్మ–సాంబయ్య దంపతుల కుమార్తె కత్తుల శ్రీజ, గణేష్ యాదవ్‌ల వివాహ మహోత్సవానికి గ్రామ సర్పంచ్ డ్యాగం సుజాత సుధాకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా "అవనీ స్కీమ్" కింద రూ.10,116లను వధూవరులకు అందజేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పేదింటి ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఈ అవనీ స్కీమ్‌ను ప్రవేశపెట్టి సహాయం అందించామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బోయిని రంజిత్, వార్డు సభ్యులు గాజు శివాజీ, కుక్కమూడి రాజేందర్, మహ్మదాపురం–మర్రిపల్లి మాజీ ఎంపీటీసీ సౌడారపు సారంగపాణి, నాయకులు వంగ రమేష్, పొన్నాల మైపాల్, రంపీస మల్లయ్య, కుక్కమూడి చిరంజీవి, అంబీరు శివాజీ, కుక్కమూడి శ్రీను, తలబోయిన సంపత్, రాజు, అలాగే నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగం శివాజీ తదితరులు పాల్గొన్నారు.



## పొంచివున్న ముప్పు

- విరిగిన కరెంటు స్తంభాలు
- కిందకు వేళాడుతున్న విద్యుత్ వైర్లు
- భయాందోళనలో కాలనీవాసులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని పెద్దకొడెపాక గ్రామ ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు విరిగిపడి ప్రజలకు ప్రాణాపాయం కలిగించే స్థితి నెలకొంది. కాలనీలోని కొన్ని విద్యుత్ స్తంభాలు పూర్తిగా వంగిపోయి, మరికొన్ని విరిగిపోవడంతో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. గాలి వీచిన ప్రతిసారి ఒక వైర్ మరొక వైర్‌కు తగిలి మంటలు చెలరేగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎప్పుడైనా ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైర్లు చాలా దిగువకు వేలాడుతూ ఉండడంతో ఆ మార్గంలో నడవడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం సంభవించే ముందే అధికారులు స్పందించి విరిగిన స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ఆపదలో అండగా నిలిచిన కౌన్సిలర్ పూర్ణ చారి

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన యాట నాగరాణి (ముదిరాజ్) అనే మహిళ అనారోగ్య కారణాలతో అకాల మరణం చెందింది. ఆమెకు ఇద్దరు చిన్నపిల్లలు ఉండగా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో స్థానిక 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం మరియు నిత్యావసర సరుకులను అందజేశారు. చిన్నపిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, బీజేపీ నాయకులు దార్నా నారాయణదాసు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్యాడ్స్, పెన్నులు పంపిణీ

అక్షర దర్బార్,పరకాల: పదవ తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో కీలకమని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను అన్నారు. పరకాల పట్టణంలోని విద్యాలయ పాఠశాలలో మడికొండ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆయన తల్లిదండ్రులు క్రీ.శే. మడికొండ సారమ్మ–పోచయ్య జ్ఞాపకార్థం టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మడికొండ సంపత్ కుమార్, పాఠశాల యాజమాన్యం గోపి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐ రా మెటీరియల్ సరఫరాకు టెండర్లు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐలోని వివిధ కోర్సులకు అవసరమైన రా మెటీరియల్ కొనుగోలుకు సీల్డ్ కోటేశన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ప్రభుత్వం రూ. 6,52,800 బడ్జెట్ కేటాయించిందని, ఆసక్తి గల ఏజెన్సీలు లేదా కంపెనీలు ఈ నెల 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు జిల్లా కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో తమ కోటేశన్లను సమర్పించాలని సూచించారు. వచ్చిన టెండర్లను మార్చి 13న మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కొనుగోలు కమిటీ సభ్యుల సమక్షంలో తెరవనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేవలం జీఎస్టీ (GST) నమోదు కలిగి ఉన్న సంస్థలు మాత్రమే అర్హులని, టెండర్ ఫారంతో పాటు ఫర్మ్ రిజిస్ట్రేషన్, పాన్ కార్డ్ మరియు సంబంధిత ధ్రువపత్రాలను జతపరచాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అతి తక్కువ ధరకు కోట్ చేసిన సంస్థకే సరఫరా ఆర్డర్ కేటాయిస్తామని వెల్లడించారు. ట్రేడ్ కోర్సుల వారీగా రా మెటీరియల్ జాబితాను ఐటీఐ కార్యాలయం నుండి పొందవచ్చని, ఇతర వివరాలకు ప్రిన్సిపాల్‌ను 9441454947 నంబర్‌లో సంప్రదించాలని అదనపు కలెక్టర్ తన ప్రకటనలో కోరారు.

# ట్రాఫిక్ కోరల్లో పరకాల పట్టణం

- నరకప్రాయంగా మారిన రాకపోకలు
- నియంత్రణ లేని పశువుల సంచారం..
- అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- ప్రభుత్వ ఆసుపత్రి దారిలో నిలిచిపోతున్న అంబులెన్స్ లు
- పట్టించుకోని మున్సిపల్, పోలీస్ అధికారులు
- పట్టణ ప్రజల ఆగ్రహం





అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో సామాన్య ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. హనుమకొండ – భూపాలపల్లి జిల్లాల మధ్య ప్రధాన కూడలిగా ఉన్న పరకాలలో, వాహనాల రద్దీకి తోడు అస్తవ్యస్తమైన పార్కింగ్, పశువుల సంచారం తోడై పట్టణాన్ని ట్రాఫిక్ నరకంలోకి నెట్టేస్తున్నాయి.

### రోడ్లపైనే పశువుల తిష్ట..

పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో పశువులు యథేచ్ఛగా విహరిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్ల మధ్యలోనే ఇవి తిష్ట వేస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు పశువుల యజమానులపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు.

### ఆసుపత్రి మార్గంలో అడ్డంకులు..

జయ డీలక్స్ రోడ్ సమీపంలో హోల్‌సేల్ దుకాణాలు ఉండటంతో భారీ వాహనాలు రోడ్డుపైనే నిలిపి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నాయి. ఇదే మార్గం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన దారి కావడంతో, అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. రేగొండ, మొగుళ్లపల్లి, శాయంపేట, నడికూడ మండలాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

### స్కూల్ విద్యార్థుల ఇబ్బందులు..

ఉదయం, సాయంత్రం వేళల్లో కూరగాయల మార్కెట్, వాణి బుక్ సెంటర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సర్వసాధారణమైంది. పాఠశాలలకు వెళ్లే చిన్నపిల్లలు, వారి వాహనాలు ఈ రద్దీలో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పరకాలలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని, రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను తొలగించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సాగులో డ్రోన్లను వినియోగించుకోవాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ఐనవోలు మండల కేంద్రంలో డ్రోన్ల పంపిణీ



అక్షరదర్బార్, ఐనవోలు : పంటల సాగులో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ముఖ్యంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. పంటల సాగులో డ్రోన్లు ఉపయోగపడతాయని, వాటిని రైతులు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో నాబార్డ్ పథకం కింద వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రైతు సేవా సహకార సొసైటీ (నందనం)కు డ్రోన్లను కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా రైతు సేవా సహకార సొసైటీ( నందనం), పీఏసీఎస్ నర్సంపేట, పీఏసీఎస్ నెల్లికుదురులకు అందించే మూడు డ్రోన్లకు సంబంధించిన వివరాలను వ్యోమిక్ డ్రోన్స్ సంస్థ ప్రతినిధులు హనుమ, జగదీష్ జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఒక డ్రోన్ ఎన్ని ఎకరాలలో స్ప్రే చేయగలదు, రైతులకు ఎలా ఉపయోగపడుతుంది, డ్రోన్ పైలెట్లకు శిక్షణ ఇచ్చారా అని తదితర వివరాలను కలెక్టర్ అడిగారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందులు సమర్థవంతంగా పిచికారీ చేయడంతో పాటు సమయం, ఖర్చు తగ్గుతాయని రైతులు ఈ సాంకేతికతను విస్తృతంగా వినియోగించు కోవాలని తెలిపారు. డ్రోన్లను వినియోగించుకొని పంటల ఉత్పత్తిని సాధించాలన్నారు. రైతు సేవా సహకార సొసైటీ (నందనం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ మార్ట్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. మార్ట్ లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. రూరల్ మార్ట్ నిర్వహణ చాలా బాగుందని, ఇలాగే కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. రూరల్ మార్ట్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, వరంగల్ అధికారి చైతన్య, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీసీఓలు సంజీవరెడ్డి, నీరజ, హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఏడిఏ ఆదిరెడ్డి, సహకార శాఖ ఏరియా అధికారి జగన్మోహన్ రావు, సర్పంచులు రఘు వంశీ, రాజు, తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ ను తరలించాలి

**- 28వ వార్డు కౌన్సిలర్ బోగం నరేందర్**

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు ఎండి క్వార్టర్స్ ఆవరణలో ఉన్న డంపింగ్ యార్డ్ ను వెంటనే వార్డు నుండి తరలించాలని 28వ వార్డు కౌన్సిలర్ భోగం నరేందర్, టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య సింగరేణి అధికారులను కోరారు. ఏరియాలోని ఎండి క్వార్టర్స్ లో నెలకొన్న పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం సింగరేణి ఏరియా జుఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నరేందర్, బడితల సమ్మయ్యలు మాట్లాడుతూ భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఎండీ క్వార్టర్స్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు నుండి వెలువడే కాలుష్యంతో 28వ వార్డు ప్రజలు అనేక ఇబ్బందులకు, అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. వెంటనే ఏరియా జీఎం ప్రత్యేక చొరవ తీసుకోని డంపింగ్ యార్డును తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు, వారి కుటుంబ సమస్యల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన కాకతీయ స్టేడియంలో మంచినీటి సౌకర్యం, వాష్రూమ్స్ లేకపోవటం, మెరుగైన ట్రాక్ లైన్ లేకపోవటంతో అహ్లాదం, వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ఎండీ క్వార్టర్లలో పాడైపోయిన గేట్లు, ఫ్లోరింగ్, తలుపులు, క్వార్టర్లకు పేయింటింగ్ పోవటం, వీది దీపాలకు మరమ్మత్తులు లేక కార్మిక కుటుంబాలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, వెంటనే మరమ్మత్తులు చేపించాలని డిమాండ్ చేశారు. ఎండీ క్వార్టర్స్ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

## రేపు జనగామలో మెగా జాబ్ మేళా

**- 300 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు**

అక్షరదర్బార్, జనగామ : జనగామ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, డీఆర్డీఏ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా జరుగనుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ మహేంద్ర అండ్ మహేంద్ర లిమిటెడ్‌లో మొత్తం 300 ఖాళీల భర్తీ కోసం ఈ ఇంటర్వ్యూలు చేపడుతున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి పి. సాహితి వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్స్ కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో మార్చి 6వ తేదీ ఉదయం 10:30 గంటలకు జనగామ మున్సిపల్ కాన్ఫరెన్స్ హాల్‌కు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సీనియర్ అసిస్టెంట్ జె. గీతను 7995430401 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.



నామినేషన్ వేస్తున్న వేం నరేందర్ రెడ్డి



అభిషేక్ మను సింఘ్వి నామినేషన్

# రాజ్యసభ బరిలో వేం.. సింఘ్వి

- అసెంబ్లీలో నామినేషన్లు దాఖలు
- ఎమ్మెల్యేలు, ఎంపీల సమక్షంలో అందజేత
- వేం నరేందర్ రెడ్డికి అవకాశం.. ఉమ్మడి జిల్లాకు దక్కిన గౌరవం
- వైఎస్సార్, కేవీపీ స్నేహం తరహాలో రేవంత్, వేం స్నేహం
- సోషల్ మీడియాలో వారి ఫ్రెండ్ షిప్ పై చర్చ

అక్షరదర్బార్, హైదరాబాద్:
తెలంగాణ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిచే కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారయ్యారు. ఏఐసీసీ ప్రతినిధి, సుప్రీం కోర్టు సీనియర్ అడ్వొకేట్ మను సింఘ్వితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వేం నరేందర్ రెడ్డి గురువారం తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు నామినేషన్ సెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రి మండలి సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ శ్రేణుల కోలాహలంతో అసెంబ్లీ ప్రాంగణం సందడిగా మారింది. నామినేషన్ అనంతరం అభ్యర్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ తరఫున రెండోసారి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం తన అదృష్టమని అభిషేక్ మను సింఘ్వి పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టు పెంచుకుంటున్న తీరు ఈ అభ్యర్థుల ఎంపికలో స్పష్టంగా కనిపిస్తోంది. మొదటి స్థానానికి సిట్టింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వి పేరును అధిష్ఠానం ముందే ఖరారు చేయగా, రెండో స్థానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బుధవారం రాత్రి వరకు జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం వేం నరేందర్ రెడ్డి పేరు ఖరారైంది. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టడం, పార్టీలో అందరితో సానుకూల సంబంధాలు ఉండటంతో నరేందర్ రెడ్డి వైపు అధిష్ఠానం మొగ్గు చూపింది. వీరికి ఎంఐఎం పార్టీ మద్దతు ప్రకటించడం గమనార్హం.

**- కేవీపీ, వైఎస్సార్ స్నేహంలా వేం, రేవంత్**

నాడు వైఎస్సార్ తన ఆత్మీయుడు కేవీపీ రామచంద్ర రావును ఢిల్లీలో తన మనిషిగా రాజ్యసభకు పంపిన తరహాలోనే, నేడు సీఎం రేవంత్ రెడ్డి సైతం తన స్నేహితుడు వేం నరేందర్ రెడ్డి విషయంలో అదే ఫార్ములాను అమలు చేశారు. సొంత పార్టీలోని ప్రత్యర్థులకు, ఇతర సీనియర్లకు ఈ నిర్ణయం ద్వారా రేవంత్ రెడ్డి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. టీడీపీ కాలం నుంచి కొనసాగుతున్న వీరి స్నేహం ఇప్పుడు రాజ్యసభ వరకు చేరింది.  ఈ విషయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. వారిద్దరి స్నేహాన్ని నెటిజన్లు కొనియాడరుతున్నారుఉ. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు దాదాపు ఖాయం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అసెంబ్లీలో ఉన్న బలాబలాల ప్రకారం రెండు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనున్నాయి. నామినేషన్ దాఖలు చేసే సమయంలో ముఖ్యమంత్రి అభ్యర్థుల వెంట ఉండి వారిని ప్రోత్సహించారు. మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల గడువు ముగియనుండటంతో, అధికారులు పత్రాలను పరిశీలించి తదుపరి ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ స్థాయిలో గళం వినిపించే సమర్థులను ఎంపిక చేశామని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

**- అధినాయకత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు**

**: వేం నరేందర్ రెడ్డి**

తనపై నమ్మకంతో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన పార్టీ అధిష్ఠానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా తనను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీలో నెలకొన్న పోటీ మధ్య అధిష్ఠానం తన పేరును ఖరారు చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రికి సలహాదారుగా పనిచేసిన అనుభవం, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పెద్దల సభలో గళం వినిపిస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# మొక్కజొన్న రైతుల ఆగ్రహం

- విక్రయాల సొమ్ము జమ చేయాలని డిమాండ్
- గంగారంలో రోడ్డుపై బైఠాయించి నిరసన


అక్షరదర్బార్, గంగారం: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పెద్ద ఎల్లాపురంలో మొక్కజొన్న రైతులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. తాము పండించిన పంటను విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా, ఇంతవరకు ప్రభుత్వం నుంచి నగదు జమ కాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 234 మంది రైతులకు సంబంధించిన ఐదు కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, దిక్కుతోచని స్థితిలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. తదుపరి పంట వేయడానికి పెట్టుబడి లేక, అప్పులు తెచ్చిన సొమ్ముకు వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్)లో జరుగుతున్న అక్రమాల వల్లే తమ డబ్బులు ఆగిపోయాయా లేక అధికారుల నిర్లక్ష్యం కారణమా అని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో నిరసనను మరింత ఉధృతం చేస్తామని రైతులు డిమాండ్ చేశారు.



# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

అక్షరదర్బార్, చెల్పూర్: గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని మసీదులో గురువారం జరిగిన ఇఫ్తార్ విందులో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని  ఎమ్మెల్యే అన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేవి ఒకటేనని, మనుషులంతా సోదరా భావంతో ఉండాలన్నారు. ఈ మసీదుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.



# కారు, బైక్ ఢీ..

**ఇద్దరు యువకులు మృతి**

అక్షరదర్బార్, రేగొండ: భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని నారాయణపురం వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. పరకాల– భూపాలపల్లి జాతీయ రహదారిపై నారాయణపురం వద్ద కారు– బైకు ఢీకొన్న ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పరకాల నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న బైకు, భూపాలపల్లి నుంచి రేగొండ వైపు వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. రేగొండ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రేపు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై సమావేశం

- హాజరుకానున్న జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లా అధికారులు

అక్షరదర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో శుక్రవారం ఉమ్మడి జిల్లా అధికారులతో 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక' పై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల కలెక్టర్లతోపాటు జిల్లా స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. సమావేశం అనంతరం సాయంత్రం 4.30 గంటలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ నుంచి హైదరాబాద్ బయలుదేరుతారు. 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక'పై ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన విషయం తెలిసిందే.

# జీపీ తీర్మానంతో సీనియర్ మేటు తొలగింపు

అక్షర దర్బార్ శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్న సీనియర్ మేటు ముక్కెర రంజిత్ కుమార్ ను గ్రామపంచాయతీ తీర్మానం ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ సదర్ లాల్ మాట్లాడుతూ రంజిత్ కుమార్ ఉపాధి హామీ పథకం లో చేసిన పనులలో అనేక అవకతవకలకు పాల్పడినట్టు తెలిపారు. గురువారం గ్రామపంచాయతీ గ్రామసభ నిర్వహించి వార్డు సభ్యుల సమక్షంలో తీర్మానం చేసి తొలగించినట్టు తెలిపారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ సంఘాల బిక్షపతి వార్డు సభ్యులు మిరియాల సమ్మక్క,అజ్మీర జోయ్,తరాల చంద్రమౌళి, గోపరాజు లక్ష్మి, ఒంటేరు వెంకట్రాజు, బొమ్మ కంటి శాంతి కుమార్ ,తరాల లక్ష్మి ప్రజలు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915